సాక్షి మహబూబాబాద్

సోమవారం । 18 । మార్చి । 2024



జాగ్రత్తలు పాటిస్తే మంచి రేటు

మిరప పంట కోతలు ప్రారంభమయ్యాయి. మిరప కోత, ఆరబెట్టే సమయంలో సరైన జాగ్రత్తలు పాటిస్తే లాభాలు పొందవచ్చని అధికారులు సూచిస్తున్నారు. - 8లో▸



ఆకాశమే హద్దుగా..

మరిపెడ మండలం భూక్య తండాకు చెందిన యశ్వంత్ ఆకాశమే హద్దుగా.. తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. దేశ కీర్తిని నలుదిశల చాటి చెబుతున్నాడు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.4° /24.0°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి కాస్త ఉక్కపోతగా ఉంటుంది.



నేటినుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు

- హాజరుకానున్న 8,191 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 49 సెంటర్లు.. 144సెక్షన్ అమలు
- సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల నిషేధం
- 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

పది పరీక్షలకు సిద్ధమైన మోడల్ స్కూల్





పరీక్షలకు వేళాయె..

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 18(నేటి) నుంచి పరీక్షలు ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీన ముగియనున్నాయి. కాగా జిల్లాలో 8,191మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని అధికారులు తెలిపారు. సీసీ కెమెరాల నిఘా, ప్రత్యేక బృందాల మధ్య పరీక్షలు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. సేహ్నపూర్వక వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఉదయం 9:30నుంచి..

పరీక్షలు ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, సైన్స్ పరీక్ష మాత్రం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:50 గంటల వరకు నిర్వహిస్తారు. జిల్లాలో మొత్తం 49పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని అధికారులు వెల్లడించారు. జిల్లాలో మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 8,191మంది, ప్రైవేటు విద్యార్థులు 309 పరీక్షలు రాయనున్నా న్నారు. జిల్లావ్యాప్తంగా 439 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారని వెల్లడించారు. అన్ని పరీక్ష కేంద్రాలకు సీఎస్, 49మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 49మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. వారు నిర్వర్తించాల్సిన విధులపై ప్రత్యేక సలహాలు, సూచనలు ఇచ్చారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, విద్యార్థుల కోసం బల్లలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే ప్రాథమిక చికిత్స కోసం పరీక్ష కేంద్రాల వద్ద ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచి, మందులు, వైద్య చికిత్స అందిస్తారు.

నిబంధనలు అతిక్రమిస్తే..

అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి, పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామని, ఇన్విజిలేటర్లు, సిబ్బంది, సీఎస్‌లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, అధికారులు విధులు నిర్వర్తిస్తారని అధికారులు తెలిపారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తెస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. విద్యార్థులు చెప్పులు మాత్రమే వేసుకొనిరావాలని షూల్ ధరించొద్దని సూచించారు. పరీక్ష సమయంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన, ప్రోత్సహించిన వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అంతేకాక ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్లలో కోత విధించడం, కొద్ది రోజులపాటు ఉపాధ్యాయులను విధులకు దూరంగా ఉంచడం లాంటి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నిబంధనలు పాటించాలి..

విద్యార్థులు పరీక్షకు గంట ముందే పరీక్ష కేంద్రాలకు వెళ్లి తమ హాల్‌టికెట్ నంబర్‌ను పరిశీలించుకోవాలని డీఈఓ రామారావు సూచించారు. పరీక్ష హాళ్లకు విద్యార్థులు ఉదయం 9గంటలలోపే చేరుకోవాలన్నారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనప్పటికీ విద్యార్థులను అనుమతిస్తామని, హాల్ టికెట్‌లో పేర్లు తప్పుగా ఉంటే సవరించుకోవాలన్నారు. కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలన్నారు.

కట్టుదిట్టమైన బందోబస్తు

జిల్లాలో సమస్యాత్మక పరీక్ష కేంద్రాలు దంతాలపల్లి, తొర్రూరు, గార్ల సెంటర్లలో గతంలో ఆరోపణలు, మాల్‌ప్రాక్టీస్ జరుగగా.. వాటిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన పోలీసు సిబ్బంది, 144 సెక్షన్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని అధికారులు పేర్కొన్నారు. అందుకు ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు.

న్యూస్‌రీల్

నిబంధనలు పాటించాలి

డీఎస్పీ ఎన్.తిరుపతిరావు



మహబూబాబాద్ రూరల్ : జిల్లాలో ప్రతి ఒక్కరు ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని డీఎస్పీ ఎన్.తిరుపతిరావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. డీఎస్పీ ఎన్.తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, రూరల్ ఎస్సై వి.దీపిక, ఏఎస్ఐ రమేష్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. అదే విధంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేసి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎన్.తిరుపతిరావు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతిరోజు పోలీసుల తనిఖీలు జరుగుతాయని, ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు.

చెక్‌పోస్టు పరిశీలన

కేసముద్రం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును డీఎస్పీ తిరుపతిరావు ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని చెక్ చేయాలని డీఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై వంశీధర్ పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగు..



మహబూబాబాద్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మానుకోట మున్సిపాలిటీ పరిధిలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. కోడ్ వల్ల దాదాపు రెండున్నర నెలల తర్వాత ముసుగులు తొలుగుతాయి.

ఎన్నికలు ముగిసేవరకు ప్రజావాణి రద్దు

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికలు ముగిసేవరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి ప్రజావాణి కార్యక్రమం తేదీల వివరాలను ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వెల్లడిస్తామన్నారు. కావునా జిల్లాలోని ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

ఆలయాల శిల్పకళ అద్భుతం

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే దంపతులు, న్యాయమూర్తులు జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ రాజేశ్వర్ రావు ఆదివారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం, ములుగు జిల్లాలోని గట్టమ్మ, రామప్ప ఆలయాలను సందర్శించారు. ఆలయాల శిల్పకళా సంపదను చూసి అద్భుతంగా ఉందని అలోక్ అరాధే పేర్కొన్నారు.

- వివరాలు 8లో▸



రామప్పలోని రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

ఎన్నికలకు యంత్రాంగం సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి

మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానుకోట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయని, 15,28,419 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిందని, కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఏప్రిల్ 18 నోటిఫికేషన్, 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ, 26న స్క్రూటినీ ఉంటుందన్నారు. అదే నెల 29న విత్‌డ్రా, మే 13న పోలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. జూన్ 4న కౌంటింగ్, 6న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. నియోజకవర్గంలో 1,158 ప్రాంతాల్లో 1,783 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంలు, స్టాటిస్టికల్ సర్వేలెన్స్, చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్ బృందాలతో పాటు 16మంది నోడల్ అధికారుల నియామకం పూర్తి చేశామన్నారు. ఈవీఎంల తనిఖీలతో పాటు పీఓలు, ఏపీఓలు, సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామని చెప్పారు. స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి ఓటు నమోదుశాతం పెంచినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తాయన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తామని చెప్పారు. ఏమైనా ఫిర్యాదులు, సమస్యలు వస్తే 1950కి డయల్ చేస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రచార సభలకు సరిగ్గా దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో ఫేస్ న్యూస్ ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు ఎస్పీ చెన్నయ్య మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికలను విజయవంతం చేశామని, ఈ ఎన్నికల్లో కూడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు తక్కువగానే ఉన్నాయన్నారు. జిల్లాలో 800 మంది పోలీస్ సిబ్బంది ఉండగా అదనంగా 500 నుంచి 600 మంది విధులు నిర్వహిస్తారన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డేవిడ్, లెనిన్ వత్సల్ టొప్పో తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నూకల వెంకట్‌రెడ్డి



బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మహబూబాబాద్ అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ పార్లమెంట్ ప్రబారి నూకల వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. పార్లమెంట్‌స్థాయిలో బూత్‌లో ప్రతీఇంటి వరకు ప్రచారం నిర్వహించాలని, బీజేపీ అభ్యర్థి గెలిస్తే మానుకోటకు అధిక నిధులు వస్తాయని, దీంతో అభివృద్ధి చెందుతుందన్నారు. మూడోసారి మోదీని ప్రధానమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు, అసెంబ్లీ ప్రబారి భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, పార్లమెంట్ కన్వీనర్లు సతీష్, దేవేందర్ రావు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు రామచంద్రరావు, కొమురయ్య, అధికార ప్రతినిధి హిందూభారతి, అసెంబ్లీ కన్వీనర్ కొమ్మాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సురేందర్, సంపత్, కార్యదర్శులు వెంకటచారి, శ్రీను, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగమణి, మండల అధ్యక్షుడు నరిసింహారెడ్డి తదితరులు ఉన్నారు.


కొంగు బంగారం!



జాతరకు ముస్తాబు అవుతున్న గుంజేడు ముసలమ్మ ఆలయం



ముసలమ్మ అమ్మవారి మూల విరాట్



మండు వేసవిలోనూ జలజల పారే సెలయేరు

- భక్తుల కోరికలు తీర్చే ముసలమ్మ
- 20నుంచి గుంజేడు జాతర

కొత్తగూడ: భక్తుల కోరికలు తీర్చి కొంగు బంగారంగా నిలిచే గుంజేడు ముసలమ్మ జాతరకు ముస్తాబవుతోంది. జిల్లాలోని కొత్తగూడ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో పచ్చటి ప్రకృతి ఒడిలో కొలువుదీరన ముసలమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. మొక్కులు సమర్పించుకుని ప్రకృతి ఒడిలో రోజంతా ఆహ్లాదంగా గడిపి వనభోజనాలు చేయడానికి భక్తులు ఎంతో ఇష్టపడతారు.

ముసలమ్మ చరిత్ర..

ఆదివాసీ తెగకు చెందిన తోలెం వంశీయులకు ఆడబిడ్డగా ముసలమ్మను కీర్తిస్తారు. ముసలమ్మ యుక్త వయసులో వాగు వద్ద ఆడుకుంటుండగా కొందరు దారిన పోయే పోకిరీలు అఘాయిత్యం చేసేందుకు యత్నించగా అమ్మవారికి కోపం వస్తుంది. ఆకోపానికి గాలి తీవ్రరూపం దాల్చి పోకిరీలతో సహా గ్రామంలోని ఇళ్లు, చెట్లు కొట్టుకుపోతాయి. అనంతరం అమ్మవారు కనిపించకుండా పోతుంది. అమ్మవారి కోసం వెతుకుతున్న తన వంశీయుల కలలో కనిపించి గుట్టపైకి నెలవయ్యానని, వాగువద్ద ఏరుమద్దిచెట్టు వద్ద తనకు పూజలు నిర్వహించాలని చెబుతుంది. చూసేందుకు వచ్చిన కుటుంబీకులకు మద్దిచెట్టు మొదట ఉన్న పుట్టపై పసుపు, కుంకుమ కనిపిస్తాయి. నాటి నుంచి స్థానికులు మొక్కులు చెల్లించి వనభోజనాలు చేయడం ఆనవాయితీ. క్రమంగా విషయం రాష్ట్రమంతా తెలిసి అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రతీ శుక్రవారం గుంజేడుకు వస్తుంటారు.

ఆదివాసీల నోట వేద మంత్రాలు..

జాతరకు భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో దేవాదాయశాఖ ఆధీనం చేసుకుని తోలెం వంశీయులకు వేద మంత్రాలలో శిక్షణ ఇప్పించారు. జాతరకు వచ్చే భక్తులకు ఆదివాసీలు వేదమంత్రాలతో పూజలు చేయడం ఇక్కడి ప్రత్యేకత.

20 నుంచి జాతర..

నిత్యం భక్తుల రద్దీతో ఉండే గుంజేడు ముసలమ్మకు రెండేళ్లకోసారి ప్రత్యేక జాతర నిర్వహిస్తారు. బుధవారం అమ్మవారికి బోనాలతో ఆదివాసీ పూజారులు నిష్ఠతో నైవేద్యం సమర్పిస్తారు. గురువారం గుట్ట నుంచి వనం తీసుకుని వచ్చి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠిస్తారు. శుక్రవారం భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు అదేరోజు వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.

అభివృద్ధి శూన్యం..

ఎందరో భక్తులు నిత్యం దర్శించుకునే ముసలమ్మ జాతర అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దేవాదాయశాఖ నిధులు కేటాయించి పలు అభివృద్ధి పనులు చేసేందుకు యత్నించినా జాతర మొత్తం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నదని అటవీశాఖ అనుమతులు రాక నిలిచిపోతున్నాయి. ఈఏడాది పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క చొరవతో కొన్ని అభివృద్ధి పనులకు అనుమతులు లభించాయి. జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు, సేద తీరేందుకు షెడ్లు, వనభోజనాలు చేసేందుకు హట్‌లు, జాతరలో అంతర్గత రోడ్లు, మహిళల కోసం బాత్‌రూంలు, నిత్యం ప్రవహించే వాగుకు ఇరువైపులా మెట్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

అభివృద్ధికి అనుమతివ్వాలి



ఆలయ ప్రాంగణంలో కల్యాణ కట్ట, వాగులో స్నానఘట్టాలు, మహిళలకు స్నానపుగదులు, అంతర్గత రోడ్లు, గుట్టకు సీసీ రోడ్డు, తాగునీటి వసతి లాంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చి నిధులు మంజూరు చేయాలి. జాతర నిర్వహణ బాధ్యతలు పూర్తిస్థాయిలో ఆలయ కమిటీకి అప్పగించాలి.

- తోలెం వెంకన్న, పూజారి

భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి



వైభవోపేతంగా జరిగే ముసలమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి. బోనాల నుంచి అమ్మవారి ఆగమనం, వన ప్రవేశం వరకు అన్ని తిలకించి భక్తులు మొక్కులు తీర్చుకోవాలి. అమ్మవారిని ఉన్న అన్ని రకాల ఆభరణాలతో అలంకరించి భక్తుల దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాటు చేశాం.

- తోలెం వెంకటేశ్వర్లు, ప్రధాన పూజారి

లింకు తెరవగానే నగదు మాయం

గార్ల : యూట్యూబ్‌లో వచ్చిన అపరిచిత లింక్ ద్వారా రూ.1,35,000 నగదు పోగొట్టుకున్న ఘటన ఆదివారం అంజనాపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై ఎన్.జీనత్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుగులోత్ సాయికుమార్ యూట్యూబ్‌లో వచ్చిన ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి పథకంలో ఆలిండియా ఫర్టిలైజర్ కెమికల్ డీలర్‌షిప్ ఇస్తామని, ఇందుకోసం దుకాణం రిజిస్ట్రేషన్, అగ్రిమెంట్ కోసం డబ్బులు చెల్లించాలని లింక్ వచ్చింది. ఈ లింక్ ద్వారా 7దఫాలుగా రూ.1,35,000 ఫోన్ పే చేశాడు. ప్రొడక్ట్ రిలీజ్ కోసం ఇంకా రూ.75,000 చెల్లించాలని కోరగా అనుమానం వచ్చి గార్ల ఎస్‌బీఐకి వెళ్లి మేనేజర్‌ను అడుగగా ఇదంతా మోసం అని వివరించారు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకున్నారు.

ఉచితంగా చదువుకోండిలా..

- గురుకులంలో న్యాయ విద్య
- గతేడాది కాజీపేటలో ప్రారంభం
- హాస్టల్ వసతి, మెస్, ఇతర సదుపాయాలు
- ఇటీవల విడుదలైన టీఎస్ లాసెట్ నోటిఫికేషన్

విద్యారణ్యపురి: తెలంగాణలో పేద విద్యార్థులు న్యాయ విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటివరకు యూనివర్సిటీ కళాశాలలు, ప్రైవేట్ కాలేజీల్లో మాత్రమే న్యాయ విద్య అందించేవారు. పేద విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో 'లా' చేయాలంటే.. వేలకు వేలు ఫీజు సమర్పించుకోవాల్సి వచ్చేది. చాలా మందికి ఆసక్తి ఉన్నా.. ఫీజు చెల్లించేందుకు వెనుకడుగు వేసేవారు. అయితే గతేడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా న్యాయ విద్యను అందిస్తోంది.

గురుకులాల ద్వారా..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిబాపూలే బలహీన వర్గాల గురుకుల విద్యాలయాల సంస్థ 2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్రత్యేకంగా గురుకులాల ద్వారా న్యాయ విద్య అందిస్తోంది. బాలురకు హైదరాబాద్ వద్ద మహేశ్వరంలో, బాలికలకు కాజీపేటలోని సోమిడి రోడ్డులో 'లా' గురుకుల కళాశాల ఏర్పాటు చేసి నడిపిస్తున్నారు. ప్రభుత్వ నిర్వహణలో సాగే.. ఈ కళాశాలలో చేరే విద్యార్థులకు టీఎస్ లా సెట్ ద్వారా అడ్మిషన్లు ఇస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల్లో కనిష్ఠ ఆదాయం కలిగిన వారు, ఇంటర్ పూర్తయిన వారు మాత్రమే ఈ 'లా' గురుకుల కళాశాలలో అడ్మిషన్లుపొందవచ్చు.

అనేక సదుపాయాలు..

ఈ రెసిడెన్షియల్ 'లా' కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్లకు గరిష్ఠ వయో పరిమితి 20 ఏళ్లు.. వివాహితులకు ప్రవేశం లేదు. విద్యార్థులు తప్పనిసరిగా హాస్టల్‌లో వసతి పొందాలి. విద్యార్థులకు ఉచిత హాస్టల్, మెస్ సౌకర్యం, యూనిఫామ్, నోట్ బుక్స్ వంటి అనేక సదుపాయాలు ఉంటాయి. నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేకమైన శ్రద్ధ చూపే అధ్యాపకులు ఉంటారు.

నామమాత్రపు ఫీజు..

ఐదేళ్ల లా కోర్సుకు నామమాత్ర ఫీజు కేవలం రూ.4 వేలు. అలాగే.. రూ.4,000 కాషన్ డిపాజిట్ అడ్మిషన్ సమయంలో చెల్లించాల్సి ఉంటుంది. కాషన్ డిపాజిట్ రుసుమును కోర్సు పూర్తయ్యాక తిరిగి చెల్లిస్తారు.

కాజీపేట గురుకుల లా కళాశాలలో 60 సీట్లు

ప్రస్తుతం కాజీపేటలోని గురుకుల 'లా' కళాశాలలో విద్యార్థినులకు 60 సీట్లు, హైదరాబాద్ మహేశ్వరం కళాశాలలో 60 సీట్లు బాలురకు అందుబాటులో ఉన్నాయి.

ఇటీవల లా సెట్ నోటిఫికేషన్..

తెలంగాణలోని వివిధ యూనివర్సిటీల పరిధిలోని లా కళాశాలలకు టీఎస్ 'లా' సెట్ నోటిఫికేషన్ ఇటీవలే విడుదల చేశారు. 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకునేందుకు నోటిఫికేషన్ వెలువడింది. చివరి తేదీ ఈఏడాది ఏప్రిల్ 15. అపరాధ రుసుము రూ.500లతో ఏప్రిల్ 25వ తేదీ వరకు అవకాశం ఉంది.

ఎవరికి ఎన్ని సీట్లు..

గురుకుల లా కళాశాలలో ఉన్న 60 సీట్లలో బీసీ ఏ–13, బీసీ–బి 15, బీసీ–సి 2, బీసీ–డి 11, బీసీ–ఈ 6, ఈబీసీ–1, ఎస్సీ–9, ఎస్టీ– 3 సీట్లు కేటాయిస్తారు. కాగా.. హనుమకొండ జిల్లా కాజీపేటలోని న్యాయ విద్య గురుకుల మహిళా కళాశాలలో గత విద్యా సంవత్సరం ఐదేళ్ల లా కోర్సు ప్రారంభమై కొనసాగుతోంది. ఇందులో 25 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈవిద్యాసంవత్సరం ఫస్టియర్‌లోనూ ప్రవేశాలు ఉంటాయి. లాసెట్ ద్వారానే అడ్మిషన్లు ఇవ్వనున్నారు.

క్లుప్తంగా

జూన్‌లో పగిడిద్ద రాజు జాతర



వెంకటాపురం(కె) : మండల పరిధిలోని ఎదిర గ్రామంలో ఆదివారం పగిడిద్దరాజు గుడి ఆవరణలో ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్‌లో నిర్వహించనున్న పగిడిద్ద రాజు జాతర తేదీలను నిర్ణయించారు. జాతరను జూన్ 11వ తేదీ నుంచి 14 వ తేదీ వరకు నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు పర్శిక తిరుపతి రావు, వెంకటరావు, చంద్రరావు, సూర్యారావు, పుల్లయ్య, బతకయ్య, దామోదర్, బాలకృష్ణ, కారం కన్నయ్య తదితరులు ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక



గంగమ్మ, ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న రహీమొద్దీన్, రషీదాబేగం

మరిపెడ/మరిపెడ రూరల్ : ఓ ముస్లిం కుటుంబం హిందూ దేవుళ్ల పండుగను ఘనంగా జరుపుకోవడం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీకి చెందిన రహీమొద్దీన్, రషీదాబేగం దంపతులు గ్రామ శివారున ఉన్న తమ వ్యవసాయ క్షేత్రంలో గంగమ్మ, ఎల్లమ్మ ఆలయాన్ని గత ఏడాది నిర్మించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. దేవతలకు జంతుబలిదానం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తాను ముస్లిం అయినప్పటికీ గంగమ్మ, ఎల్లమ్మ దేవతలు కలలోకి వచ్చి గుడి కట్టించి పండుగ చేసుకోవాలని చెప్పినట్లు రహీమొద్దీన్ దంపతులు తెలిపారు. అప్పటి నుంచి వ్యవసాయ క్షేత్రంలో గుడి నిర్మించి ప్రతి ఏడాది బంధు, మిత్రులతో వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

'దామోదర్' సేవలకు గుర్తింపు



దామోదర్‌కు మెడల్ అందజేస్తున్న అనంత్ శర్మ

హన్మకొండ : సామాజిక సేవకుడు, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సంఘం సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ సేవలకు తగిన గుర్తింపు లభించింది. ఆదివారం చెన్నైలో కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హనుమకొండకు చెందిన పల్లెపాడు దామోదర్ సేవలను గుర్తించిన కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ అనంత్ శర్మ మెడల్ అందించి సత్కరించారు. వినియోగదారులను చైతన్యవంతులను చేయడంతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న దామోదర్‌కు మెడల్స్ అందజేశారు.

జాగ్రత్తలు పాటిస్తే మంచి రేటు

- మిరప కోతలు, కల్లాల్లో ఆరబెట్టే పద్ధతిపై ఉద్యానశాఖ అధికారి సూచనలు



కల్లంలో ఆరబోసిన మిర్చి



మిర్చిని పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి రమేశ్

చెన్నారావుపేట : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మిరప పంటను సుమారుగా 80 వేల ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మిరప పంట కోతలు ప్రారంభమయ్యాయి. మొదటి కోత పూర్తి చేసుకొని రెండో కోతను సైతం ప్రారంభించారు. మిరప కోత, ఆరబెట్టె సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకవపోవడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ఆదాయం రాక ఇబ్బంది పడుతున్నారు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి దయ్యాల రమేష్ రైతులకు సూచలిస్తున్నారు.

నాణ్యతలేని మిరపకాయలతో..

మిరప రైతులు ఎకరాకు సుమారుగా 25–30 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్న నాణ్యత లేని కారణంగా నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. సరైన సమయంలో కోతలు చేయక నాణ్యత తగ్గడం, మార్కెట్లో ధర లేక ఎగుమతికి పనికి రాక, వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడం వంటి కారణాలతో రైతులు నష్టపోతున్నారు. పంట మార్పిడి చేయకపోవడం, ఇబ్బడిముబ్బడిగా పురుగు మందులు వాడటం, కోసిన పంటను సరైన పద్ధతిలో ఆరబెట్టడంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి కారణాలతో నాణ్యతలేని మిరపకాయలు వస్తున్నాయి.

కోతలు..



తోటలో కొన్ని మిరపకాయలు పండిన వెంటనే కూలీలతో ఏరిస్తే, చెట్లు విరిగిపోయి తోటకు నష్టం జరుగుతుందని రైతులు భావిస్తుంటారు. చాలా కాయలు పండిన తర్వాత ఒకేసారి ఏరవచ్చని ఆలస్యం చేస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో అకాల వర్షాల వల్ల కూలీల కొరత ఏర్పడవచ్చు. మంచువల్ల పండిన కాయలు రాలిపోతాయి. దీంతో తెల్ల కాయలు ఎక్కువగా వస్తాయి. అందువల్ల రైతులు తోటలో సరైన రంగు, సైజులో ఉన్న మిరప కాయలను వెంట వెంటనే ఆరబెట్టాలి. కాయకోత తర్వాత ఎరువు(పొటాష్ సంబంధిత) 0-0-52, 13-0-45లాంటి పొటాష్ సంబంధిత ఎరువులను బిందు సేద్యం ద్వారా ఫర్టిగేషన్ పద్ధతిలో అందించినట్లయితే కాయ సైజు, రంగు మెరుగుపడుతుంది. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. అదే విధంగా నీటి తడులు అందించాలి. రైతులు కనీసం నాలుగు, ఆరు దఫాలుగా కాయలు కోయాలి. ఇలా చేయడం వల్ల ఒక కోతకు రేటు రాకపోయినా మరో కోతకు ధర వచ్చే అవకాశం ఉంటుంది.

ఆరబెట్టే పద్ధతి..

కొన్ని సార్లు మిర్చి కోతల సమయంలో అధిక వర్షాల కురిసినట్లయితే సకాలంలో కోతలు జరగకపోవడం, కోసిన వాటిని సరైన పద్ధతిలో ఎండబెట్టలేక పోవడం వల్ల నాణ్యతలేని మిర్చి వస్తుంది. దీంతో మార్కెట్లో ఆశించిన ధర రాక రైతులు నష్టపోతారు. మిరపకాయల్ని ఎండబెట్టే కల్లాన్ని గట్టి భూమి ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలి. అవసరమైతే ఇసుక ప్రదేశంలో కల్లాలు ఏర్పాటు చేసుకున్నట్లయితే కాయ రంగు మారదు. తొందరగా ఎండడమే కాకుండా నాణ్యత తగ్గదు. త్వరగా మార్కెట్‌కు తరలించే అవకాశం ఉంటుంది. దీనివల్ల దుమ్ము ఎక్కువగా చేరదు. వెడల్పు తక్కువగా, పొడవు ఎక్కువగా దీర్ఘచతురస్రాకారంలో ఉండేలా చూసుకోవాలి. దాదాపు 10 క్వింటాళ్ల మిర్చికి 30అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు కల్లం ఏర్పాటు చేసుకోవాలి. కల్లం సైజును బట్టి పైనకప్పే టర్పాలిన్ తెచ్చుకోవాలి. ఉదయం మంచు ఆరిన వెంటనే కవర్‌ను తీసివేసి కాయలను బోదెలుగా కాళ్లతో దున్నుకోవాలి. ఇలా చేస్తే, గాలి, వెలుతురు తగిలి కాయలు త్వరగా ఎండుతాయి. కాయలు పూర్తిగా ఎండకముందే తెల్లకాయలను వేరుచేయాలి. కాయల్లో 5 శాతం తేమ ఉన్నప్పుడే వాటిని మండెపోసి గోనె సంచులతో కప్పాలి. మార్కెట్‌కు తీసుకెళ్లె రోజు ఉదయం శుభ్రమైన ఖాళీ సంచుల్లో నింపాలి. ఒక్కో సంచిలో 40 కిలోలకు మించి నింపరాదు. ఎక్కువ కాయల్ని సంచిలో నింపితే కాయ నాణ్యత పోయి మార్కెట్లో సరైన ధర రాదు. ఇలాంటి పద్ధతులతో నాణ్యమైన మిరపకాయలు వచ్చే అవకాశం ఉంది.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

వరంగల్ : హైదరాబాద్ వాతావరణ కేంద్రం రాష్ట్రంలో ఈ నెల 18, 19, 20తేదీల్లో రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపినందున మిర్చి రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జ్, జేడీఎం మల్లేశం ఒక ప్రకటనలో కోరారు. ఈమేరకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం మిర్చి సరుకులు అధిక మొత్తంలో వస్తున్నందున తమతమ అడ్తి వారిని సంప్రదించి వారి సూచనల మేరకు తీసుకోని రాగలన్నారు. వాతావరణం మేఘావృతం అయి ఉండడం వల్ల మిర్చి రంగు, నాణ్యత పూర్తి స్థాయిలో కనిపించక పోవటం వల్ల కూడా ధరలపై ప్రభావం ఉంటుందన్నారు.

ఆలయాల శిల్పకళ అద్భుతం



వేయిస్తంభాల ఆలయంలో జస్టిస్ దంపతులకు మహాదాశీర్వచనం అందజేస్తున్న ఉపేంద్రశర్మ



న్యాయమూర్తులకు రామప్ప ఆలయ విశిష్టతను వివరిస్తున్న గైడ్ విజయ్‌కుమార్

- రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే
- ఉమ్మడి వరంగల్ ఆలయాల సందర్శన



న్యాయమూర్తి దంపతులను సన్మానిస్తున్న గట్టమ్మ ఆలయ పూజారులు

హన్మకొండ కల్చరల్/వెంకటాపురం(ఎం)/ములుగు రూరల్: వేయిస్తంభాల, రామప్ప దేవాలయాల శిల్పకళ అద్భుతంగా ఉందని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే అన్నారు. హనుమకొండలోని రుద్రేశ్వరాలయం, ములుగు జిల్లాలోని రామప్ప ఆలయాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే దంపతులతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ రాజేశ్వర్‌రావు ఆదివారం సందర్శించారు. వారికి ఆయా ఆలయాల అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, మణికంఠశర్మ, హరీష్‌శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా జస్టిస్ దంపతులు రుద్రేశ్వరస్వామి వారికి అభిషేకం, బిల్వార్చన నిర్వహించిన అనంతరం ఉపేంద్రశర్మ వారికి తీర్థప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు ఆలయ విశిష్టత, కాకతీయుల శిల్పకళ నైపుణ్యం, చరిత్రను వివరించారు. తర్వాత నూతనంగా పునరుద్ధరించిన కల్యాణ మంటపాన్ని జస్టిస్ దంపతులు తిలకించారు. అలాగే.. రామప్పలోని రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించిన తర్వాత ఈఓ బిల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు న్యాయమూర్తి దంపతులను సత్కరించారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా 'పురాతన ఆలయమైన రామప్పను సందర్శించడం ఆనందంగా ఉంది.. రామప్ప శిల్పాకళ అద్భుతం.. ఆలయం గురించి గైడ్ చాలా చక్కగా వివరించారు.. ఇక్కడికి రావడం మరిచిపోలేని అనుభూతి' అంటూ పురావస్తుశాఖ వీఐపీ రిజిస్టర్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే పేర్కొన్నారు. వారివెంట హైకోర్టు రిజిస్ట్రార్లు నందికొండ నరసింహారావు, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ములుగు జిల్లా జడ్జి పీవీ.లలితా శివజ్యోతి, జడ్జిలు మాధవి, రామ్మోహన్‌రెడ్డి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, న్యాయవాదులు ఉన్నారు. రామప్పకు రాకముందు హైకోర్టు న్యాయమూర్తి అలోక్ ఆరాధే దంపతులు ములుగు మండలంలోని గట్టమ్మ గుడికి చేరుకోగా పూజారుల సంఘం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారిని శాలువాలతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. వారి వెంట ములుగు ఎస్పీ శబరీష్ ఉన్నారు.

ఘనంగా రుద్రమ సాహిత్య సభలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంపశయ్య నవీన్

హన్మకొండ కల్చరల్ : రుద్రమ ప్రచురణలు ఆధ్వర్యంలో రుద్రమ సాహిత్య సభలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో రుద్రమ ప్రచురణల నిర్వాహకులు అనిశెట్టి రజిత అధ్యక్షత వహించిన సభలో రచయిత్రులు రాసిన ఐదు పుస్తకాల ఆవిష్కరణ చేశారు. మొదటి సమావేశంలో 'చిమమండ న్గోజి అడిచె' ఫెమినిస్ట్ మ్యానిఫెస్టో ప్రసంగాల పుస్తకాన్ని కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, ప్రముఖ నవల రచయిత అంపశయ్య నవీన్ ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం జరిగిన సమావేశాలలో తమ్మెర రాధిక రాసిన 'హవేలీ దొర్సాని' కథా సంపుటిని బీవీఎన్ స్వామి ఆవిష్కరించారు. అనిశెట్టి రజిత సంపాదకత్వంలో వెలువడిన 'భారతదేశంలో వితంతు వ్యవస్థ' పుస్తకాన్ని తిరునగరి దేవకి ఆవిష్కరించారు. తమ్మెర రాధిక రాసిన 'కాల జాడలు తీస్తూ' కవితా సంపుటిని కవి పొట్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. చివరి సమావేశంలో అనిశెట్టి రజిత రాసిన 'కాలం కాన్వాస్ మీద' కవితా సంపుటిని వీఆర్ విద్యార్థి ఆవిష్కరించారు. కొమర్రాజు రామలక్ష్మి సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు నాగిల్ల రామశాస్త్రి, ధర్మయ్య, నిధి, పల్లె శ్రీను, పల్లేరు వీరస్వామి, బిల్ల మహేందర్, శ్రీనివాస్, మాలతీలత, తెన్నేటి విజయచంద్ర, చంద్రకళ, సింగారాజు రమాదేవి, బండారి సుజీత, బిట్ల అంజనీదేవి, మురాడి శ్యామల, కొటిపాక శోభారాణి, మందూరు అనిత తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు



సమావేశంలో మాట్లాడుతున్న వి.ఎస్.రావు

హన్మకొండ : ఆర్టీసీ కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు అన్నారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కరీంనగర్ జోనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ రీజియన్ల నుంచి ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వి.ఎస్.రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా ఆర్టీసీలో కొత్త బస్సులు కొనలేదని, కొత్త నియామకాలు జరగలేదని, పని భారం పెరిగిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ కార్మికులపై మరింత పని భారం పెరిగిందన్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన 3,000 బస్సులు కొనుగోలు చేయాలన్నారు. ఈ మేరకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్ బకాయిలు, సీసీఎస్ నిధులు, 2013 వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన 2017 వేతన సవరణ 21 శాతంను వెంటనే అమలు చేయాలని, ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వరంగల్ రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.రామచందర్, టీ.ఎల్లయ్య, ఖమ్మం రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, సుధాకర్, కరీంనగర్ రీజియన్ కార్యదర్శి రాజయ్య, నాయకులు

4 వరకు 'దూరవిద్య' ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్యా కేంద్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ ద్వితీయ, ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఆయా కోర్సుల టర్మ్ ఫీజుతో పాటు పరీక్ష ఫీజును ఏప్రిల్ 4వ తేదీవరకు చెల్లించాలని దూరవిద్యా డైరెక్టర్ ఆచార్య వి.రాంచంద్రం తెలిపారు. ఇటీవలనే ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు తమ టర్మ్ (కోర్సు) ఫీజును గడువులోగా చెల్లించాలన్నారు. బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్, బీబీఏ, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు తమ పరీక్ష ఫలితాల కోసం వేచి చూడకుండా టర్మ్ ఫీజు, పరీక్ష ఫీజు చెల్లించి పుస్తకాలు తీసుకోవాలన్నారు. ఆయా ఫీజులను ఎస్‌బీఐ, యూబీఐ బ్యాంకుల ద్వారా డైరెక్టర్, ఎస్‌డీఎల్‌సీఈ కాకతీయ యూనివర్సిటీ పేరున కేయూ బ్రాంచ్ ఐఎఫ్ఎస్‌సీ కోడ్ (ఎస్‌బీఐఎన్ 0020262)లో వరంగల్ నందు చెల్లుబాటు అయ్యేలా డీడీ ద్వారా లేదా దూరవిద్యాకేంద్రంలోని ఎస్‌బీఐ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ నుంచి చలానా ద్వారా చెల్లించాలన్నారు. వివరాలకు 0870–2461480, 2461490 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆకాశమే హద్దుగా..

- పర్వతారోహణలో రాణిస్తున్న భూక్య యశ్వంత్
- ఏప్రిల్ 5న మౌంట్ ఎవరెస్ట్ పర్వతారోహణకు సిద్ధం
- దాతల సాయం కోసం ఎదురుచూపు



ఆస్ట్రేలియాలోని మౌంట్ కోస్కియుస్కో పర్వతంపై త్రివర్ణ పతకాన్ని ఎగురవేస్తున్న యశ్వంత్ (ఫైల్)

మరిపెడ రూరల్ : ఆకాశమే హద్దుగా.. తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. ప్రపంచంలోని పలు ఎత్తైన పర్వత శిఖరాల సిగలో భారత త్రివర్ణ పతకాన్ని ప్రతిష్ఠించి, దేశ కీర్తిని నలుదిశల చాటిచెబుతున్నాడు. కానీ ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్‌ను ఎక్కేందుకు దాతలు ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్య తండాకు చెందిన భూక్య యశ్వంత్ పేద గిరిజన కుటుంబంలో జన్మించాడు. యశ్వంత్ ఆకాశమే హద్దుగా ఆత్మవిశ్వాసంతో పర్వతాలను అవలీలగా అధిరోహిస్తున్నాడు. కలల సాకారానికి అడుగులు వేస్తు పట్టుదలతో ముందుకు సాగుతున్నాడు. ఇప్పటికే ఐదు పర్వతాలను ఎక్కాడు. ఇప్పుడు ప్రపంచంలోని ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్ అధిరోహించి తన కలను సాకారం చేసుకోవాలని సిద్ధమవుతున్నాడు.

ఐదు పర్వతాలు అధిరోహణ..

20 ఏళ్ల వయస్సులోనే యశ్వంత్ ఏడు ఖండాల్లోని అత్యంత ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించాలని ముందుకు సాగుతున్నాడు. ప్రపంచంలోని ప్రసిద్ధ ఐదు పర్వాతాలను దక్షిణాఫ్రికాలో 5,895 మీటర్ల ఎత్తైన పర్వతం మౌంట్ కిలిమంజారో ప్రతికూల పరిస్థితుల మధ్య విజయవంతంగా అధిరోహించాడు. రష్యాలోని ఎల్‌బ్రస్ 5,642 మీటర్లు గడ్డకట్టిన మంచులో పర్వతాన్ని ఎక్కాడు. ఆస్ట్రేలియాలోని 2,228 మీటర్ల మౌంట్ కోస్కియుస్కో, హిమాచల్ ప్రదేశ్‌లోని 6,100 మీటర్ల మౌంట్ యూనమ్, మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ 5,364 మీటర్ల అధిరోహించాడు. లేహ్‌లోని 6,000 మీటర్ల పర్వతాన్ని కూడా అధిరోహించి త్రివర్ణ పతకాన్ని ఎగురవేశాడు. ఏప్రిల్ 5వ తేదీన ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడానికి సిద్ధమవుతున్నట్లు యశ్వంత్ తెలిపాడు.

దాతలు సాయం చేయండి

పర్వతారోహకుడిగా యశ్వంత్ ఐదేళ్ల నుంచి భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన పలు పర్వతాలను అధిరోహించాడు. సమ్మిట్ ఛాలెంజ్‌తో ఏడు ఖండాల్లోని పలు శిఖరాలను అధిరోహించాలన్న ఆశయంతో ముందుకు సాగుతున్నాడు. కానీ ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొవల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఎవరెస్ట్‌ను ఎక్కేందుకు సుమారు రూ.40 లక్షలు (క్లైంబింగ్ పర్మిట్‌లు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, వైద్యసాయం, దుస్తులు, ఇతర సామగ్రి)కి ఖర్చవుతుంది. ఇప్పటి వరకు దాతల ద్వారా రూ.15 లక్షలు సేకరించాడు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి తనకు ఆర్థిక సాయం అందించాలని మౌంటైనర్ భూక్య యశ్వంత్ కోరుతున్నాడు.

దాతలు 7075013778 ఫోన్ పే, గూగుల్ పే ద్వారా లేదా ఎస్‌బీఐ అకౌంట్ నంబర్: 38877487142(ఐఎఫ్ఎస్‌సీ: ఎస్‌బీఐఎన్ 0004515) సాయం చేయాలని భూక్య యశ్వంత్ వేడుకుంటున్నాడు.

అమ్మవార్ల దర్శనానికి వచ్చి..

- జంపన్నవాగు మడుగులో గల్లంతై భక్తుడి మృతి



మృతదేహాన్ని తీసుకొస్తున్న పోలీసులు

ఎస్ఎస్‌తాడ్వాయి: సమ్మక్క–సారలమ్మ అమ్మవార్ల దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు జంపన్నవాగులోని మడుగులో గల్లంతై మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదారాబాద్‌లో పోచమ్మబస్తీ అడిక్మెట్‌కు చెందిన రాపాని రాజు(22) సమ్మక్క–సారలమ్మ దర్శనం కోసం మేడారం వచ్చాడు. రెడ్డిగూడెం కొత్తూరు కాజ్‌వే వద్ద జంపన్నవాగులోని పాలమడుగులో స్నానం చేస్తుండగా లోతు తెలియక అందులో మునిగి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఏఎస్సై నారాయణ, కానిస్టేబుళ్లు నీలకంఠేశ్వరన్, వెంకటేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకున్నారు. నీటి మడుగులో గల్లంతై మృతి చెందిన రాజు మృతదేహాన్ని బయటకు తీశారు. రాజు హైదారాబాద్‌లోని రియల్ ఎస్టేట్‌లో ఆఫీస్ బాయ్‌గా పని చేస్తున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని బయటకు తీసిన కానిస్టేబుళ్లను పోలీసు అధికారులు అభినందించారు.

తేనెటీగల దాడి.. వృద్ధుడి మృతి

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండల పరిధి కళ్లెం గ్రామానికి చెందిన పుంద్రు నారాయణరెడ్డి(80) తేనెటీగల దాడిలో మృతి చెందినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నారాయణరెడ్డి ఆదివారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. వరి పంటను కోతులు ధ్వంసం చేస్తుండగా వాటిని కొడుతుండగా.. సమీపాన చెట్టుపై ఉన్న తేనెటీగలు దాడి చేశాయి. అక్కడే స్పృహ తప్పి పడిపోయిన నారాయణరెడ్డిని గమనించిన చుట్టుపక్కల వారు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై వివరించారు.

అండగా ఉంటాం..

- తెలంగాణ యునైటెడ్ మోటార్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్
- ఎలక్ట్రీషియన్ ఉమామహేశ్వరికి భరోసా



ఉమామహేశ్వరితో ఫెడరేషన్ బాధ్యులు

నర్మెట: భర్తను కోల్పోయి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న జనగామ జిల్లా నర్మెట మండల కేంద్రానికి చెందిన విశ్వనాథుల ఉమామహేశ్వరికి అండగా నిలుస్తామని తెలంగాణ యునైటెడ్ మోటార్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ బాధ్యులు పేర్కొన్నారు. ఈనెల 8న ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి శీర్షికన ఉమామహేశ్వరి జీవనం సాగిస్తున్న తీరుపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఫెడరేషన్ బాధ్యులు స్పందించారు. పత్రిక ద్వారా విషయం తెలుసుకున్న ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంది కృష్ణారెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాయితోజ్ పవన్‌కుమార్, జనగామ, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు దొంత రవీందర్, శనిగరం శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పర్తి రత్నాకర్ ఆదివారం ఆమెను కలిశారు. మద్దతు ప్రకటించడంతో పాటు భవిష్యత్‌లో పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక వైండర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం నంబర్–1 పై గల వెయిటింగ్ హాల్‌లో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైందని డోర్నకల్ ప్రభుత్వ రైల్వే ఎస్సై జె.సురేష్ ఆదివారం తెలిపారు. మృతురాలి వయస్సు సుమారు 70 నుంచి 75 సంవత్సరాలు ఉండవచ్చని, అనారోగ్య కారణం, వయసుమీద పైబడి ఏదో దీర్ఘకాలిక వ్యాధితో ఉన్నట్లు తెలుస్తుందన్నారు. మృతురాలి ఒంటిపై సిమెంటు రంగు నైటీ ధరించి ఉందన్నారు. మెడలో నల్లటి దారంలో రుద్రాక్ష ఉన్నదని, మృతురాలి సరైన మరణ కారణం తెలుసుకునేందుకు ఖమ్మం ప్రభుత్వవైద్యశాల మార్చురికి అన్నం సేవా సమితి డైరెక్టర్ అన్నం శ్రీనివాసరావు సహాయంతో మృతదేహాన్ని తరలించామన్నారు. స్టేషన్ స్టేషన్మాస్టర్ ఫిర్యాదు మేరకు డోర్నకల్ రైల్వే ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సదరు వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఎవరికైనా తెలిస్తే ఎస్సై 87126 58600, స్టేషన్ రైటర్ 94947 90619 ఫోన్ నంబర్లకు తెలియపర్చాలని కోరారు.

తొర్రూరులో గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తొర్రూరు: పట్టణంలోని విశ్రాంతి భవనం సమీపంలో సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం డివిజన్ కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఆయన కొంత కాలంగా పట్టణంలో యాచిస్తూ జీవనం సాగిస్తున్నాడు. పట్టణంలోని విశ్రాంతి భవనం సమీపంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించగా చనిపోయి ఉన్నాడని తెలిపారు. పోలీసులు, మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించగా మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. బూడిద రంగుషర్టు, బ్లూ కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. వివరాలు తెలిస్తే 8712656982 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్సై కోరారు.

దాడి చేసిన 9 మందిపై కేసు

శాయంపేట : ప్రేమించి పెళ్లి చేసుకున్న జంట ఇంటిపై సమీప బంధువులు దాడి చేసిన ఘటనలో పెళ్లికూతురు ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన కథనం ప్రకారం.. శాయంపేటకు చెందిన గొండ నాగరాజు, గణపురం గ్రామానికి చెందిన కళ్లెపు శ్రావణి ప్రేమించుకొని ఈ నెల 12న పెళ్లిచేసుకున్నారు. విషయం తెలుసుకున్న పెళ్లి కూతురు తల్లి బంధువులు 14న శాయంపేటకు వచ్చి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించగా కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. 16న బంధువులు పెళ్లి కుమారుడి ఇంటికి వెళ్లి దాడి చేశారు. శ్రావణి ఫిర్యాదు చేయగా దాడి చేసిన తల్లి రజిత, అన్న భరత్, తిరుపతి, సరోజన, అనిల్, సమ్మక్క, అనిత, స్వరూప, రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.